క్లుప్తంగా

సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న డీఆర్‌డీవో

చెన్నూర్‌రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం మండలాల ఏపీవో, ఈసీ, టీఏ, ఎఫ్ఏలకు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో నర్సరీల ఏర్పాటుకు బ్యాగు ఫిల్లింగ్‌పై డీఆర్‌డీవో శేషాద్రి పలు సూచనలు అందించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో దత్తారావు, ఆయా మండలాల ఏపీవోలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం సబ్జెక్ట్ బోధించుటకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు పీహెచ్‌డీ నెట్.సెట్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని, అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత స్టడీ సర్టిఫికెట్స్‌తో నేరుగా శనివారం 11గంటలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి అమ్మా గార్డెన్స్ ఏరియాలో సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ పలువురు మహిళలు గురువారం ఆందోళన చేపట్టారు. రోడ్ నంబర్ 28లో మట్టి రోడ్డు కారణంగా విపరీతమైన దుమ్ము లేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారిలో నిత్యం భారీ వాహనాల రాకపోకలు ఉంటున్న దృష్ట్యా వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్ వినియోగించుకోవాలి

బెల్లంపల్లి: ఈ నెల 30న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో క్షణికావేశంలో ఘర్షణపడిన కేసులు, భార్యభర్తల తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, భూమి గొడవల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, రాజీ పడటానికి వీలైన కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోదలిచిన వారు వన్‌టౌన్ పరిధిలోని వ్యక్తులు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

'పాదయాత్రకు తరలిరండి'

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో కార్తీక్ మహారాజ్ మహాపాదయాత్రకు తరలిరావాలని భక్తులు కోరారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 29న కన్నెపల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వస్వామి ఆలయం నుంచి సుమారు 300మంది భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. ఈ నెల 29న శుక్రవారం ఉదయం పాదయాత్రకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని పాదయాత్ర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. డిసెంబర్ 31కి అక్కడికి చేరుకొని ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు భక్తులు చేపడతారు. నూతన సంవత్సర వేడుకలు సైతం భక్తులు అక్కడే జరుపుకుంటారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ (సీబీఎస్ఈ)లో గురువారం నిర్వహించిన ముందస్తు క్రిస్మస్, సైన్స్ (కార్మెలైట్స్ ఎరుడిట్ ఎక్స్‌పో) ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదిలాబాద్ డియోసెస్ రేవరన్ ఫాదర్ జోస్ మణికతన్, డీఎస్‌వో మధుబాబులు సైన్స్ ప్రదర్శనలను ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారుచేసిన డైనోసర్, చంద్రయాన్, మై వీలేజీ తదితర ప్రాజెక్టులు కళ్లకుకట్టినట్లు ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ రినేట్, వైస్ ప్రిన్సిపాల్ కృప తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



విద్యార్థులు తయారుచేసిన డైనోసర్ ఆకృతి



ప్రదర్శనలు తిలకిస్తున్న ఫాదర్ మణికతన్



ప్రదర్శనలు తిలకిస్తున్న డీఎస్‌వో మధుబాబు

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



దండేపల్లిలో...

దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/నస్పూర్/తాండూర్: పార్లమెంట్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌పై రాహుల్ గాంధీ, ప్రతిపక్ష ఎంపీలు వ్యవహరించిన తీరును బీజేపీ నాయకులు తప్పుబట్టారు. ఇందుకు నిరసనగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో, దండేపల్లి మండల కేంద్రంలో, లక్సెట్టిపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద, నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై, తాండూర్ ఐబీ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ మందమర్రి పట్టణ కన్వీనర్ మార్త కుమారస్వామి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. రామకృష్ణాపూర్‌లో రాహుల్‌గాంధీ వెంటనే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్, బోయిని హరికృష్ణ, పెద్దపల్లి పురుషోత్తం, మెట్‌పల్లి జయరామారావు, కంకణాల సతీశ్, ముదాం మల్లేశ్, దండేపల్లిలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, రవిగౌడ్, నాయకులు పాల్గొన్నారు. లక్సెట్టిపేటలో మండల బీజేపీ నాయకులు హరిగోపాల్, కిషన్ జగన్మోహన్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్, వేణుగోపాల్, రమేష్, మందమర్రిలో ఆ పార్టీ నాయకులు దుర్గరాజ్, రమేష్, సతీష్, వినోద్, రామకృష్ణాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరుముళ్ల పోషం, వేముల అశోక్, ధన్‌సింగ్, దండు రాజేందర్, ఊషన్న, బంగారి ప్రసాద్, నస్పూర్‌లో బీజేపీ పట్టణ కన్వీనర్ రమేశ్, ప్రధాన కార్యదర్శి ఈర్ల సధానందం, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రానవేన శ్రీనివాస్, తాండూర్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీ కృష్ణ దేవరాయలు, బీజేపీ జిల్లా నాయకులు భరత్, చిరంజీవి, శేషగిరి, తుకారాం, కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్: గ్రామాల్లో నిరంతరం పరిసరాల పరిశుభ్రత పాటించాలని, రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు తెలిపారు. మండలంలోని వేలాల గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు రోడ్లు, మురికి కాల్వలను శుభ్రం చేయాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం డంపుయార్డును పరిశీలించి కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ చేపడుతూ, కంపోస్ట్ షెడ్డు ద్వారా వచ్చే ఎరువును పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు అందించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. శ్మశానవాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయనతో పాటు మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల, ఉపసర్పంచ్ డేగ నగేశ్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్ ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రావు, అధికారులు

రేవంత్‌రెడ్డి, వివేక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

రామకృష్ణాపూర్/భీమారం/జైపూర్/మందమర్రి రూరల్/చెన్నూర్: సింగరేణిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో 80శాతం స్థానికులకే అవకాశం కల్పించాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయటంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కృషి ఫలితంగానే సర్క్యులర్ జారీ అయిందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వివేక్ చిత్రపటాలకు భీమారం, రామకృష్ణాపూర్, జైపూర్, చెన్నూర్, మందమర్రి ఐఎన్టీయూసీ కార్యాలయాల్లో గురువారం క్షీరాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో రామకృష్ణాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, గోపతి రాజయ్య, తేజావత్ రాంబాబు, మహంకాళి శ్రీనివాస్, వొడ్నాల శ్రీనివాస్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందుగుల రమేశ్, బుక్యా లక్ష్మణ్, చిప్ప సమ్మయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జైపూర్ మండల అధ్యక్షుడు ఫయాజ్, మందమర్రి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్, చెన్నూర్‌లో కాంగ్రెస్ నాయకులు పాతర్ల నాగరాజు, చెన్న నారాయణ, చీర్ల సుధాకర్‌రెడ్డి, మంత్రి లక్ష్మణ్, లింగంపల్లి మహేశ్, కడవండి మహేశ్, సుమంత్, ఈర్ల నారాయణ, జక్కుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



భీమారం: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీ రోడ్డునంబర్ 5లో గల రవీందర్ ఇంటిపై నిర్మిస్తున్న టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ ఆ కాలనీ ప్రజలు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలోనూ సెల్‌టవర్‌ను నిర్మించేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామని, ఇళ్ల మధ్య ఇలా టవర్‌ను నిర్మిస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఈ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసేలా చూడాలని కోరారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటపల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో బొప్పారం, కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. బ్యాంక్ పథకాలు, క్రాప్‌లోన్స్, పాదుపులోన్, హౌ సింగ్ లోన్ అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్‌మోసాలపై పాటల రూపంలో కళాజాత బృందంతో వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం చిరంజీవి, విష్ణు పొదుపు మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్‌మేనేజర్

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉన్నతాధికారులు హాజరై విద్యార్థుల కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాస రెడ్డి, మండల వ్యవసాయాధికారి రజిత, వైద్య శాఖ అధికారి రఘుపతి, హాజీపూర్ ఎస్సై నరేశ్ కుమార్, జిల్లా విద్యా శాఖ సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి పాల్గొని విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు ఇష్టపడి చదుకోవాలని మార్గదర్శనం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి పర్యవేక్షణలో కార్యక్రమం సాగగా కారదర్శి శ్రీనివాస్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

జైపూర్: మండల కేంద్రంలో భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గత నాలుగు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు, సుదర్శన యాగాలు చేపట్టారు. భూనీల సమేతా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించారు. బ్రహ్మోత్సవాలతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, సాయంత్రం గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. ఆయా ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఘనంగా కుంకుమ పూజలు

శ్రీరాంపూర్: కృష్ణాకాలనీలోని గీతా ప్రశాంతి నిలయంలో గురువారం కుంకుమ పూజలు నిర్వహించగా మహిళలు పెద్దయెత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 13నుంచి ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రామచంద్ర శర్మ, దాసరి రాజేశం భక్తులతో పూజలు, ఆధ్యాత్మిక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాసరి రాజేశం, లక్ష్మీనారాయణ, డీడీ ప్రసాద్‌రావు, సారయ్య పాల్గొన్నారు.



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బొగ్గుబాయి వార్తలు

'అలవెన్సులపై ఆదాయ పన్ను మాఫీ చేయిస్తాం'

- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా

శ్రీరాంపూర్: సింగరేణి ఎన్నికల్లో తాము గెలిస్తే కార్మికులకు అలవెన్స్‌లపై ఆదాయ పన్నును మాఫీ చేయిస్తామని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడారు. అలెవెన్సులపై ఆదాయ పన్ను కార్మికులకు సమస్యగా మారిందన్నారు. అంతే కాకుండా ప్రతి కార్మికుడికి 250గజాల ఇంటి స్థలంతో పాటు రూ.20లక్షల వడ్డీ లేని రుణం కూడా ఇప్పిస్తామన్నారు. గత గుర్తింపు సంఘం వైఫల్యం వల్ల సింగరేణిలో ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. తాము గెలిస్తే దీన్ని అడ్డుకుంటామన్నారు. నూతన గనులను తీసుకొచ్చి కొత్త ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 11సంవత్సరాలుగా కార్మికులకు టీబీజీకేఎస్ ఎలాంటి మేలు చేయలేదన్నారు. ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు సంపత్ ఆకుల లక్ష్మణ్, అఫ్రోజ్ ఖాన్, సదానందం, యాదగిరి, కొట్టె శంకరయ్య పాల్గొన్నారు.

'ఏఐటీయూసీని గెలిపిస్తే కార్మికులు గెలిచినట్లే'

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో హక్కులు కాపాడే ఏఐటీయూసీని గెలిపిస్తే కార్మికులు గెలిచినట్లేనని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఏరియాలోని కేకే-5గనిపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు వెలువరించిన సందర్భంగా గనిపై కార్మికులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. సింగరేణిలో ప్రభుత్వ సంఘాలకు తావులేకుండా చేసి సింగరేణిని, కార్మిక హక్కులను కాపాడుతామన్నారు. ఏరియా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

'సర్కారు సంఘాలతో సంస్థ దివాళా తీస్తుంది'

కాసిపేట: సింగరేణిలో సర్కారు సంఘాలను గెలిపించినట్లైతే ఆర్థిక దోపిడీ జరిగి సంస్థ దివాళా తీస్తుందని కార్మికుల హక్కులకు ఉద్యమించే ఏఐటీయూసీని గెలిపించుకోవాల్సిందిగా ఏఐటీయూసీ బెల్లంపల్లి, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శులు దాగం మల్లేష్, సాలేంద్ర సత్యనారాయణ కోరారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై గురువారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు టీబీజీకేఎస్, బీఆర్ఎస్‌ల పుణ్యమా అని సంస్థలో రాజకీయ జోక్యం పెరిగి కార్మికులు ఇబ్బందులు పడ్డట్లు తెలిపారు. మళ్లీ సర్కార్ సంఘాలను గెలిపించొద్దని, సుదీర్ఘ కాలంగా కార్మికుల పక్షాన పోరాడుతూ న్యాయం చేస్తున్న ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించి ప్రభుత్వాలను ప్రశ్నించే అవకాశం ఇవ్వాలన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచన అంశాలు నెరవేర్చనున్నట్లు తెలిపారు. సమావేశంలో గని ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మినారాయణ, తిరుపతి, అనిల్, ఆడెపు రవీందర్, గంప శ్రీనివాస్, శంకర్, బియ్యాల రాజన్న, దూలం రవీందర్ తదితరులున్నారు.

'సంఘాల వైఫల్యాలతోనే ప్రైవేట్ కంపెనీ చేతుల్లోకి'

జైపూర్: ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ సంఘాల వైఫల్యాల మూలంగానే సింగరేణి సంస్థ నిర్వహించాల్సిన ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేట్ కంపెనీ చేతుల్లోకి వెళ్లాయని హెచ్‌ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య తెలిపారు. మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై గురువారం హెచ్‌ఎంఎస్ ఫిట్‌కార్యదర్శి కొమురయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పవర్ ప్లాంట్‌లో భూ నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా ఇతర రాష్ట్రాల వారికి అవకాశాలు కల్పించారని, భూనిర్వాసితులకు ఒక్కరికి కూడా పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి నిరంతరం హెచ్‌ఎంఎస్ యూనియ న్ పని చేస్తుందని, ఈ మూడు సంఘాల ద్రోహం మూలంగా బొగ్గుబావులు మూతపడటం, బొగ్గు ఆధారిత పరిశ్రమలు రాక సింగరేణి స్కూళ్లు, డిస్పెన్సరీలు, అంబులెన్స్‌లు బంద్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచీ కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు దుర్గం లక్ష్మణ్, నర్సయ్య, సమ్మన్న, అశోక్, ఎస్టీపీపీ నాయకులు సాయికృష్ణరెడ్డి, చిప్పకుర్తి సంపత్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

కనుల పండువగా అయ్యప్పస్వామి ఆరట్టు

జన్నారం: మండలకేంద్రంలో అయ్యప్ప స్వాములు నిర్వహించిన ఆరట్టు కనుల పండువుగా సాగింది. అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్య స్వాముల ఉత్సవ విగ్రహాలను గురువారం బాదంపల్లి గోదావరికి తీసుకెళ్లి చక్రస్నానాలు చేయించారు. అభిషేకం చేయించి, ప్రత్యేక పూజలు జరిపారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల దీక్ష పూర్తి చేసిన అయ్యప్ప స్వాములు ఒక్కో బృందంగా శబరిమల యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. అయ్యప్ప దీక్ష కాలం పూర్తయిన స్వాములు గురువారం శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు.



ఉత్సవంలో అయ్యప్ప స్వాములు

క్రిస్మస్ సువార్త శాంతిర్యాలీ

మందమర్రిరూరల్: క్రిస్మస్ వేడుకను పురస్కరించుకుని జీసస్ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో మందమర్రిలో గురువారం సువార్త శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో చర్చి సభ్యులు పలు వీధుల గుండా శాంతి సందేశం, క్రీస్తు బోధనలు వివరిస్తూ పాటలు పాడుతూ తిరిగారు. ఈ సందర్భంగా చర్చి వ్యవస్థాపకులు ప్రేమానందం మాట్లాడుతూ... ప్రపంచంలో అన్ని దేశాల్లో జరుపుకునే ఏకైక వేడుక క్రిస్మస్ అన్నారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. మానవాళి రక్షణకు యేసుక్రీస్తు బలయ్యాడని వివరించారు. ఈ సువార్త శాంతిర్యాలీలో చర్చి సభ్యులు నవీన్‌కుమార్, విద్యాసాగర్, ప్రశాంత్ కుమార్, యోహాన్, పాల్, శాంతకుమారి, స్వరంజన, సంకీర్తన, ప్రసన్న తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జీసస్ క్రైస్ట్ చర్చి నిర్వాహకులు